క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు


దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు బుధవారం పోటెత్తారు. పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు వచ్చిన అనేక మంది ఇక్కడ శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

వృద్ధుడికి ఆశ్రయం


వృద్ధుడితో మాట్లాడుతున్న మమత

ఏయూ క్యాంపస్: మానసిక ఆరోగ్యం సరిగాలేని వృద్ధుడికి ఆశ్రయం కల్పించారు. మాకవరపాలెం దగ్గర పుట్‌పాత్‌పై పడి ఉన్న ఓ వృద్ధుడి పరిస్థితి మమత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఎల్లెటి మమత దృష్టికి వెళ్లడంతో వెంటనే ఆమె లయోలా హోమ్‌తో మాట్లాడారు. అనంతరం స్వయంగా ఆ వృద్ధుడిని ఆమె తీసుకువెళ్లి లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.

21న అప్పన్న తెప్పోత్సవం


వరాహ పుష్కరిణి వద్ద సిద్ధం చేస్తున్న తెప్ప

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి తెప్పోత్సవం(నౌకా విహారం) ఈ నెల 21న జరగనుంది. ఆ రోజు సాయంత్రం కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్వామివారు శ్రీకృష్ణాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకావిహారంతో కనువిందు చేయనున్నాడు. తెప్పోత్సవం సందర్భంగా దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారు విహరించే తెప్పని వరాహ పుష్కరిణి వద్ద ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. తెప్పోత్సవానికి వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మంగళవారం పరిశీలించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మరో పదేళ్లు అమలు చేయాలి

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు అమలు చేయాలని, దానికి ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి నిధిగా పేరు మార్చాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌ప్లాన్ గడువు ఈ నెలతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు, ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఓంకార్, అంబేడ్కర్, రాజన రమణి, బి.అప్పారావు, ఐ.గురుమూర్తి, కోటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంకా నిర్మానుష్యమే!


దుకాణాల మూతతో నిర్మానుష్యంగా పెదవాల్తేరు కూడలి



అంతంత మాత్రంగానే రామలక్ష్మి అపార్ట్‌మెంట్ జంక్షన్

ఏయూ క్యాంపస్: పండగకు స్వస్థలాలకు వెళ్లిన నగరవాసులు ఇంకా నగరానికి పూర్తిస్థాయిలో చేరుకోలేదు. దీంతో తూర్పు నియోజయవర్గంలోని పలు కూడళ్లు ఇంకా బోసిపోతున్నాయి. నిత్యం జనసమ్మర్ధంగా దర్శనమిచ్చే పెదవాల్తేరు జంక్షన్, మెంటల్ హాస్పిటల్ కూడలి, పోలమాంబ ఆలయం జంక్షన్, రామలక్ష్మి అపార్ట్‌మెంట్ కూడలి, లాసన్స్‌బే కాలనీ, తదితర ప్రాంతాలు రెండు రోజులుగా నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి రోజు మధ్యాహ్నం నుంచి దుకాణాలు సైతం తెరుచుకోలేదు. స్థానికులు మాత్రమే నగరంలో ఉండడం కనిపించింది. మంగళవారం సాయంత్రం నుంచి తూరు నియోజకవర్గంలో ప్రజలు తిరిగి రావడం కనిపిస్తోంది.

సాయంకాలం.. హాయి హాయిగా..


ఫిష్ టన్నెల్‌లో జనసందోహం


తల కిందులుగా సునామీపై..

ఏయూ క్యాంపస్: సంకాంత్రి వేడుకల్లో భాగంగా సాయంకాలం.. పిల్లా, పాపలతో కలసి సందడి చేశారు. బీచ్ రోడ్డులోని ఏయూ మైదానంలో ఏర్పాటు చేసిన ఫన్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ మంగళవారం సందర్శకులతో కళకళలాడింది. అక్వేరియం, అండర్ వాటర్ ఫిష్ టన్నెల్‌ను చూసి మంత్రముగ్ధులయ్యారు. విభిన్న చేపలు ఉన్న అండర్ వాటర్ ఫిష్ టన్నెల్‌లో సెల్ఫీలు, ఫొటోలు తీసుకోవడానికి జనం ఆసక్తి చూపారు. టిక్నోజంప్, సునామీ, మేరీ రౌండ్ వంటి రైడ్‌లను యూత్ ఫుల్‌గా ఎంజాయ్ చేశారు.

జ్యోతిబసు జీవితం ఆదర్శనీయం


జ్యోతి బసుకు నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత జ్యోతిబసు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జ్యోతిబసు 13వ వర్ధంతి కార్యక్రమాలు జేఎన్ ఫార్మాసిటీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబసు ఆశయ సాధనకు కార్మిక వర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైల్వే కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విప్లవోద్యమ నేతగా 33 ఏళ్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆదర్శ పాలన అందించారని తెలిపారు. ప్రధానమంత్రి పదవిని కూడ పార్టీ ఆదేశాల మేరకు తిరస్కరించి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.వెంకునాయుడు, పెంటారావు, కృష్ణ, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ఒక వ్యక్తిపై సోమవారం రాత్రి కొంత మంది వివాదానికి దిగి దాడికి పాల్పడిన ఘటనలో ఆ వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో సబ్బవరం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బాధితుడు గొల్లవిల్లి ఈశ్వరరావు తెలిపిన వివరాలు.. గ్రామంలో సీతారాముల తీర్థం నిర్వహించేందుకు గొల్లవిల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశం అయ్యారు. సమావేశంలో తీర్థం నిర్వహణ ఖర్చులపై చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన వడ్డాది పైడిరాజు, శ్రీను, దేవుడమ్మ, సాలాపు తమ్మిరాము, కట్ట అప్పలరాజు, కోసిరెడ్డి సన్యాసమ్మలు పండగ చేయడానికి నువ్వెవడవంటూ మూకుమ్మడిగా దాడి చేసినట్టు బాధితుడు తెలిపాడు. పండగను వంగలపైడి సంతోష్ చేస్తారని, పండగ కార్యక్రమాల్లో నేను జోక్యం చేసుకోవడానికి వీల్లేదంటూ దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ దాడిలో ఈశ్వరరావుకు పలు చోట్ల గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారని తెలిపాడు. తనపై దాడికి పాల్పడిన ఆ ఆరుగురిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రంగనాథం ఈ సందర్భంగా వెల్లడించారు.

స్వర్ణోత్సవ సంగమం

అర్ధ శతాబ్దం తరువాత కలుసుకున్న మిత్రబృందం


సందడి చేసిన పూర్వ విద్యార్థులు

దశాబ్దాల నాటి స్నేహ బంధం.. స్మృతుల పరిమళాలు వెదజల్లింది. అపూర్వ సంగమ వేళ పాత మిత్రులను జ్ఞాపకాల దొంతరలు చుట్టుముట్టాయి. ఒకటా.. రెండా.. ఏకంగా 51 సంవత్సరాల అనంతరం కలసిన మిత్రబృందం ‘అపూర్వ’ కలయికకు వేదికైంది గాజువాకలోని ఓ ఫంక్షన్ హాల్. షిప్‌యార్డులోని గాంధీగ్రామ్ హైస్కూల్ 1970–71 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా మంగళవారం కలుసుకున్నారు. అర్ధశతాబ్దపు తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆ రోజుల్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు రామకృష్ణ, నారాయణరావు, కృష్ణమూర్తి, చిట్టమ్మను ఘనంగా సత్కరించారు. డబ్ల్యూటీవో కామెంటేటర్ దేవరకొండ రవికాంత్ (జెనీవా), ఈఎన్‌టీ నిపుణుడు డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి తమ మిత్రులకు అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ మాటూరి శ్రీనివాసరావు, కో–కన్వీనర్ కర్రి పద్మారావు, ప్రతినిధులు పీబీకే ఆనంద్, వెంకటేశ్వరరావు, మళ్ల అన్నపూర్ణ, కాండ్రేగుల త్రినాథ్, సముద్రం, తులసీరావు, ఆదారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రోజంతా ముచ్చట్లతో గడిపిన వారంతా జ్ఞాపకాలను పదిలపరుచుకుని, మళ్లీ కలుసుకోవాలంటూ వీడ్కోలు పలికారు. – గాజువాక

సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

బావికొండపై ప్రపంచ శాంతి ప్రార్థన


ప్రార్థనలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని బావికొండపై ప్రపంచ శాంతి ప్రార్థనలు, బౌద్ధ ధర్మ సభ బుధవారం జిల్లా మహా బౌద్ధ సొసైటీ అధ్యక్షుడు గుణపూడి బాబులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వందన సమర్పణ, భోజన ధానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లిగిరి వెంకన్న పరస మహోత్సవ


విశేష అలంకరణలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం సనాతన పరస మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం నుండి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని, మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. పరస మహోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం వద్ద, గోవింద్‌రోడ్డు, సింహాల దేవిడి రోడ్డు, అల్లిపురం మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలు తీర్థం చూసేందుకు వచ్చిన జనాలతో కిటకిటలాడాయి. ఈ తీర్థ మహోత్సవంలో చిన్నారులు సందడి చేశారు. మహిళలు గృహాలంకరణ వస్తువులు, వ్యక్తిగత అలంకరణ వస్తువులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపించారు. ముఖ్యంగా చెరకు గడలు, పంచదార చిలకలు, కర్జూరం, వేపిన పప్పు, శనగలు వంటి వాటి వద్ద జనాలు అధిక సంఖ్యలో కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భక్తి రంజని కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. పరస మహోత్సవం సందర్భంగా బల్లిగిరి వెంకన్నను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు. ఈవో కె.పద్మావతి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదారి వెంకటమహేష్, బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్‌కుమార్, కర్రి నీలకంఠం, వెల్లంకి చిన్నమ్మలు, కణితి రమణమ్మ, కొల్లి సత్యవతితో పాటు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపికృష్ణ తదితరులు ఆయనకు స్వాగతం పలికారు.

నేడు కరకచెట్టు పోలమాంబ వార్షిక పరస


విద్యుత్ కాంతుల నడుమ పోలమాంబ ఆలయం


పోలమాంబ అమ్మవారు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక పరస బుధవారం జరగనుంది. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చుట్టు పక్కల 14 గ్రామాల భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకోనున్నారు. పెదవాల్తేరు, గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములవారి పట్టాభిషేకం, భజనచెట్టు, కోలాటం, తప్పెటగుళ్ళు ప్రదర్శనలు ఉంటాయని ఆలయ ఈవో డి.వి.ఎస్ సురేష్ బాబా తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ధర్మ దర్శనంతో పాటు రూ.100 టికెట్‌తో అంతరాలయ దర్శనం, పూజ చేయనున్నారు. రూ.516 టికెట్ తీసుకున్న భక్తులకు గోత్ర నామాలతో ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకం, ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయం వద్ద పెదవాల్తేరుకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో చిరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ మార్గం కోలాహలంగా మారనుంది.

తప్పిపోయిన పిల్లలు అప్పగింత


బాలుడిని అప్పగిస్తున్న పోలీసులు

బీచ్ రోడ్డు: నగర పోలీసుల స్పందన అద్భుతంగా ఉందని పలువురు కొనియాడుతున్నారు. ఫిర్యాదు ఇచ్చిన నిమిషాల వ్యవధిలో సమస్యను పరిష్కరించి బాధిత కుటుంబాల్లో ఆనందం నింపుతున్నారు. సంక్రాంతి పండగలో భాగంగా సాగర తీరానికి పెద్ద సంఖ్యలో కుటుంబాలతో తరలివచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఒక బాలుడు, మంగళవారం ఇద్దరు పిల్లలు తప్పిపోయారు. ఈ విషయాన్ని పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా.. నిమిషాల వ్యవధిలోనే పిల్లలను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంళవారం నెల్లూరుకు చెందిన అంగలి కుమారి(6), విజయవాడకు చెందిన ప్రకాష్(5) తప్పిపోయారు. తక్షణమే స్పందించిన పోలీసులు తమ బీబీ వాట్సాప్ గ్రూప్‌లో బాలుడు ఫొటో షేర్ చేశారు. పిల్లల ఆచూకీ కోసం పోలీసులు తీరం మొత్తం గాలించగా.. పోలీసు మెస్ ఎదురుగా 4:30 గంటలకు గుర్తించారు. అనంతరం వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. పిల్లలు తల్లితండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అతి తక్కువ సమయంలో పిల్లల ఆచూకీని గుర్తించిన పోలీసులు నగర సీపీ శ్రీకాంత్ అభినందించారు.

‘ఉక్కు’ సెగ ఢిల్లీని తాకేలా..

- 30న ప్రజా గర్జన
- ఉక్కు పోరాట కమిటీ నాయకులు వెల్లడి
- 705వ రోజుకు రిలే దీక్షలు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఢిల్లీకి సెగ తాకేలా ఈ నెల 30న ఉక్కు ప్రజాగర్జన నిర్వహించనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్య ఉద్యమాలతో కేంద్రప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 705వ రోజు మంగళవారం సంస్థలోని డబ్ల్యూ.ఆర్.ఎం–1 మరియు 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, చిత్రాడ సన్యాసిరావు, కె.శ్రీనివాసనాయుడు, గుమ్మడి నరేంద్ర, బి.డేవిడ్ తదితరులు ప్రసంగించారు. కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్రప్రభుత్వం అణచివేయలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖ ఉక్కు చాలా ముఖ్యమని, దీనిని ప్రైవేటీకరణ చేస్తే ప్రజలందరూ నష్టపోతారని తెలిపారు. లక్షల మందికి అన్నం పెడుతున్న పరిశ్రమను అమ్మేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా, కేంద్రప్రభుత్వం కార్మికుల మనోభావాలకు విలువనిచ్చి ప్లాంట్ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మురళి, బాషా, రాజు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన తిరుపతిరావు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో రావాడ శివారు బొట్టవానిపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో చినగంట్యాడకు చెందిన వై.తిరుపతిరావు(44)కు కాలు విరిగిపోయింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు.. చినగంట్యాడకు చెందిన వై.తిరుపతిరావు మంగళవారం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి అచ్యుతాపురం వెళుతున్నాడు. రావాడ శివారు బొట్టవానిపాలెం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన నావెల్ డాక్‌యార్డ్‌కు చెందిన పోలీసు వాహనం తిరుపతిరావును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతిరావు కాలు విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 19న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



జానపద నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: సంక్రాంతి సంబరాలలో భాగంగా శిల్పారామం(జాతర)లో మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు అబ్బురపరిచాయి. నగరానికి చెందిన కుశల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం గణపతి స్తుతి గీతంకు చేసిన కూచిపూడి నృత్యంతో ప్రారంభం అయింది. అన్నమయ్య కీర్తనలకు కళాకారులు అద్భుతంగా కూచిపూడి నృత్యం ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కుండపై ప్రదర్శించిన నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జానపద నృత్య ప్రదర్శన హుషారుగా సాగింది.

కళాకారులు దుర్గాభవాని, యశస్విని, గీతాంజలి, సారిక, రోషని, సీత, కారుణ్య రాఘవ తదితరులు పాల్గొనగా.. అన్నపూర్ణ నృత్య దర్శకత్వం వహించారు. ఏవో విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.